
# నిన్నటి కన్నీళ్ళ వెచ్చదనం

కథ

గోపరాజు నారాయణరావు



"దార్లో ఎక్కడైనా పోస్టు చెయ్యవే అమ్మలూ!"

ఈ వారం రోజులుగా అమ్మ నోటి నుంచి వచ్చిన మాటల్ని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. అందులో ఇదొహటి. అందుకే సర్దుతున్న పుస్తకాలని అలాగే వదిలేసి కస్తూరి మేడం వైపు చూసింది అమ్మలు.

మెత్తటి శబ్దంతో అప్పటికే ఓ రెండు కార్డులు ఆ టేబుల్‌పైన పడ్డాయి.

టేబుల్ కిందే ఉన్న చెప్పుల్లోకి పాదాలు పెడుతూనే, మీదనున్న కళ్ళజోడూ తీసుకున్నారామె. అంటే స్కూలుకే!

మామూలుగా అయితే అమ్మలికి చిన్నసైజు క్లాసు తీసుకునిగాని వెళ్ళరు. కాలేజీ, అవర్స్, లెసన్స్, పరీక్షలు, చేసిన టిఫిన్, సర్దిన కేరియర్, వీటిలో విటమిన్లు, కూతురు శరీరంలో లోపించిన విటమిన్లు వంటివి చాలా ఉంటాయందులో. ఇప్పుడామె మొహమే చెబుతున్నది, ఆ కస్తూరి కాదని. వ్యాకులతో డస్సిపోయిన మొహం. నిద్రలేని కళ్ళు.

............ హఠాత్తుగా మెలకువ వచ్చి చూస్తే, సావిట్లో టేబుల్ లైట్ వెలుగుతోంది. ఎంత రాత్రో ఆ నిశ్శబ్దమే చెబుతున్నదపుడు. మిల్క్‌బల్బ్ కాంతిలో ఏదో పుస్తకం చదువుతున్నారు కస్తూరి మేడం. వాల్‌క్లాక్ చూస్తే- రెండూ యాభయ్‌ఒకటి.

'అమ్మా! మూడవుతోంది!'

గుర్తు చేద్దామనుకుంది అమ్మలు. మాట పెగల్లేదు. అమ్మని అలా చూడడం కొత్తేంకాదు. అసలు ఆ ఇంట్లోను, కస్తూరి జీవితంలోను ఇలాంటి రెప్పపడని రాత్రులు, మౌనవ్రతాల్లో ఘనీభవించే పగళ్ళు సంవత్సరంలో కొన్నయినా ఉంటాయి.

మౌనంగా మెట్లు దిగారు కస్తూరి మేడం.

అమ్మలు ఆ కార్డులని చేతుల్లోకి తీసుకుంది. ముందు అడ్రస్‌లు వెతికింది- ఆత్రంగా.

ప్చ్... తేజకి కాదు. అసలు హైదరాబాద్‌కే కాదవి. ఎవరో పూర్వ విద్యార్థుల ఉత్తరాలకి జవాబులు. సుపరిచితమైన ప్రత్యుత్తరం- 'మీ ఉత్తరం అందింది. సంతోషం. మీరు జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించే మీ కస్తూరి మేడం.'

ఆమె దగ్గర చదువుకున్న ఎందరో రాస్తూ ఉంటారు- రిసెర్చిలో చేరామని, చేశామని, ఉద్యోగాలు వచ్చాయని, అవార్డులు, పతకాలు తీసుకున్నామని, విదేశాలకి వెళుతున్నామని- ఇలా. వాటికి తప్పనిసరిగా జవాబు ఇస్తారామె, ఆ రెండు ముక్కల్లోనే.

తేజ కూడా జవాబు కోసం ఎదురు చూస్తూ ఉంటాడు కదూ!

అమ్మలు కళ్ళు చెమర్చాయి, ఆ దృశ్యం తలుచుకున్నాక.

ప్రాప్ట్‌గా అందిందా ఉత్తరం. రెండున హైదరాబాదలో పోస్టు చేశాడు తేజ. నాలుగు సాయం కాలం చేరింది....

అమ్మా!

నమస్సులు. క్షేమం. అనుకున్నట్టే ఆస్ట్రేలియా ప్రయాణం నిర్ణయమైంది. 15న బేగంపేటలో ఫ్లైట్. గత ఉత్తరాల్లో నీకు రాశాను కదా! ఆ కంపెనీ వాళ్ళే పిలిచారు. మళ్ళీ ఇండియా రావడం ఎప్పుడో?! ఎన్నేళ్ళకో!.

మా తాతయ్య ఇప్పుడు లేరు. కాబట్టి నీవు రావచ్చు. రావాలి. ఇప్పుడు కూడా నీ స్కూలు, నీ పాఠాలు, అడ్మినిస్ట్రేషను అంటావా? అనకు. ఆ రోజు ఆదివారం. అయినా కూడా వీలు పడదంటావా? చెప్పు. ఇంకో రెండురోజులకి వాయిదా వేస్తాను. నా ఫ్లాట్‌కు వస్తే 'వాళ్ళంతా' ఉంటారని సంకోచించకు. 'సంకోచించకుండా ఉండడం ఎలా సాధ్యంరా' అనుకుంటున్నావా? అయితే ఏర్‌పోర్టుకైనా సరే. నాకు సంతోషమే. నువ్వు రావడం ప్రధానం. నేనే రావాలనుకున్నాను. అదేమిటో ఊపిరి సలపనట్టుగా ఉంది. ట్రిప్‌కు సంబంధించి ఆఫీసులో ఇంకా కొన్ని పనులు ఉండిపోయాయి. అమ్మా! హైదరాబాద్ నీకు కొత్తకాదు. దూరమూకాదు. కనీసం ఒళ్ళు తగ్గించమని క్లాసు తీసుకోడానికైనా ఒక్కసారిరా. ముందే చెబుతున్నా. నా ఒబేసిటీ గురించి ఇక పాఠాలు చెప్పే అవకాశం నీకు రాకపోవచ్చు. అక్కడ పనికి, వెదర్‌కి థిన్‌గా అయిపోతాన్ట.

అమ్మల్ని అడిగినట్టు చెప్పు. రాజారామ్ గారికి నమస్సులు.

నీ జవాబు కోసం ఎదురు చూస్తూ ఉంటానన్న సంగతి కాస్త గుర్తు పెట్టుకో చాలు. ఉంటా.

నీ తేజు

ఏమిటో... వాడికీ నాకూ ఈ దూరం ఏమిటో?!

గొంతు నిండా దు:ఖపు పూడిక .గుండెలో అలజడి. అంతలోనే నిర్లిప్తత. ఔను దూరమే మరి.

మరోసారి కూడా చదివారు కస్తూరి మేడం. ఆపై మడుస్తూ మళ్ళీ అనుకున్నారు. 'సందేహం లేదు. వాడు అక్కడ ఉండిపోవడానికే వెళ్ళిపోతున్నాడు'.

లేఖ మడిచేసినా పంక్తులు కళ్ళముందు కదులుతూనే ఉన్నాయి- ఆ ముప్పయ్యేళ్ళలోని జ్ఞాపకాల దగ్గరికి తీసుకుపోతున్న తోవల్లా...

బీయస్సీ ఫైనల్ పరీక్షలకి కూర్చున్న కస్తూరిని ఆ వెంటనే పెళ్ళిపీటల మీద కూడా కూర్చోబెట్టారు.

పెద్ద మనవరాలి పెళ్ళో అంటూ కస్తూరి తాతగారే జరిపించేశారు. కస్తూరి తండ్రీ తల్లోగ్గారు. మూడో మనిషి ప్రమేయమే లేదు, కస్తూరితో సహా. ఒక్కడే కొడుకు. లక్షల ఆస్తి. తాత గారికి బాగా కావల్సినవాళ్ళు. సంబంధం చెప్పడానికి వెళ్ళిన వాళ్ళు ముహూర్తాలతో తిరిగొచ్చారు. వరుడికి హారతి ఇచ్చొచ్చిన అమ్మ దిష్టినీళ్ళ పళ్ళెం అలాగే పడేసి దేవుడి గదిలో తలబాదుకుని ఏడవడం, నాన్న కొలీగ్ ఒకాయన పెళ్ళి పందిట్లోనే ఆయన్ని పట్టుకుని ' ఏం ముంచుకొచ్చిందనయ్యా ఇలాంటి సంబంధం చేస్తున్నావ్?' అని అడిగేసిన సంగతి కస్తూరికి తరువాతెపుడో తెలిశాయి.

మండపంలో గంగాధరాన్ని చూసి నిర్ఘాంత పోయింది కస్తూరి. తన కళ్ళు మరీ చారడేసి

కాదు గాని, కొన్ని క్షణాలలో తన భర్త స్థానంలో నిలవబోతున్న మనిషిని చూశాక అవి ఆకర్ణాంతాలైపోయాయి. తెల్లటి మొహం ఎర్రబారిపోయింది.


తటాల్న గుర్తొచ్చింది కస్తూరికి. అదే... అదే... చిన్నపుడు చాకలమ్మా యివరం తెచ్చిపెడుతూ ఉండేది, ఇస్త్రీ బట్టల మూట. చలవ చేసిన మరో తెల్లటి గుడ్డతో కట్టి ఉండేది. గంజితో రెపరెపలాడే గుడ్డ. తెచ్చి సావిట్లో పెట్టగానే ఒక్కసారైనా ఎక్కికూర్చునేది. అదే మూట. కొత్త చేతుల బనీను, తెల్లటి మధుపర్కంలో ఇంత పొట్ట... తల మొండెం మధ్య ఆ భాగం మాయమైపోయింది. ముప్పయ్ రెండు దాటే ఉంటాయి వరుడికి. పెళ్ళిపీట చాలక యమయాతన పడుతున్నాడు. ఒబేసిటి... ఊబ. కుందనపు బొమ్మని పెళ్ళి కూతుర్ని చేసినట్టున్న కస్తూరిని పక్కన కూర్చోబెట్టాక గంగాధరమే తలొంచుకున్నాడు.

'ఒక బట్టలమూటతో ఈ బతుకంతా కాపరం చేయాలా?!'

పీటల మీదే కాదు, నిత్యం అలా ఒక్కసారైనా అనుకునేది కస్తూరి. ఆశ్చర్యం, అలా అనుకోవడంలోనే మూడేళ్ళు దొర్లాయి. మొదటి సంవత్సరం అత్తవారిల్లనబడే ఆ లంకంత కొంపలోనే గడిచింది. పేరుకు అత్తవారిల్లే అయినా, అక్కడ ఆ హోదా కలిగిన మనిషి మాత్రంలేదు. ఆమె గురించి ఎవరూ ప్రస్తావించరు. ఇంట్లో కొన్ని గుమ్మాలు పట్టని భర్త సంగతి సరే. వీథరుగు మీద ఉండే ఆ పాత ఫేము కుర్చీకి వేసి దిగ్గొట్టేశారేమో అన్నట్టు ఎప్పుడూ లోపలికి రాని వృద్ధ సింహం లాంటి మామగారు, ఆ వయసు వాళ్ళే ఇద్దరు విధవలు, ఓ అరడజను మంది పరివారం. ఇదీ జనాభా. నిశ్శబ్దం ఆ ఇంటి ఆచారమేమో అన్నట్టు తండ్రీ, కొడుకు మాట్లాడుకునే వారే కాదు. ముసలమ్మలు వంటింటిలో మాత్రమే గొంతు తగ్గించి మాట్లాడేవారు. గంగాధరాన్ని అంతా గౌరవించేవారు. ఆ ఇల్లు ఇంకా అలాగైనా మిగిలి ఉందీ అంటే అది అతడి మంచితనం వల్లనేననే వారు. కస్తూరి వాళ్ళలా గంగాధరాన్ని చూడలేకపోయింది, భర్తయినా కూడా. అలాఅని అగౌరవపరిచిందనీ చెప్పడానికి లేదు. ఏదీ చెప్పలేని తనం. ఇదే ఆమెను తల్లిని కూడా చేసింది. ఇందుకు కస్తూరి సంతోషించింది- కనీసం సంవత్సరం పాటు ఆ ఇంటికి, ఈ మూటకి దూరంగా వెళ్ళే అవకాశం ఈ రూపంలోనైనా వచ్చినందుకు!

మరీ ముఖ్యంగా, సంసార సుఖం పేరిట ఒక మూట కింద ఊపిరి బిగపట్టి తాను అనుభవించే నరకం తప్పినందుకు. కళ్ళు మూసుకుని ఆ కొన్ని లిప్తలు త్వరగా గడవాలని కోరుకునే దుస్థితి తాత్కాలికంగానైనా తప్పుతున్నందుకు. మనసు తన్మయం కావలసినపుడు తన శరీరం తనకే రోతగా అనిపించేటట్టు చేసే ఈ ఘడియలని రేపటి కొన్ని రాత్రులు ఇలా అయినా గర్భస్రావం చేసుకోబోతున్నందుకు.

ఏడాది తరువాతే మళ్ళీ కస్తూరి అత్తవారింటికి వచ్చింది - చంకలో తేజాతో.



ముసలాయన మొహంలో మొదటిసారి మందహాసాన్ని చూసింది కస్తూరి. ఇద్దరు ముసలమ్మలు గుండ్ల మీద ముసుగులు సంగతి కూడా మరిచిపోయి పట్టపగ్గాలు లేకుండా పొద్దుపోయిందాకా స్నానమని, సాంబ్రాణి అని, దిష్టితీత అని తిరిగారు.

పిల్లవాడిని నిద్రపుచ్చి బీరువాలో బట్టలు సర్దుతోంది కస్తూరి. చెక్క మెట్ల మీద అడుగుల చప్పుడయింది. పాత రెయిలింగ్‌తో మెలితిరిగిన మెట్లు. మెట్ల మీద అడుగులు పాత డాబాలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఒక లిప్త తరువాత గదిలో ఎవరో ఆయాసపడుతున్న శబ్దం వినిపిస్తే వెను తిరిగింది. గంగాధరం. భారంగా ఊపిరితీస్తున్నా, ఉయ్యాల్లో నిద్రోతున్న తేజుని మురిపెంగా చూసుకుంటున్నాడు.

మనిషిలో ఏదో మార్పు. అంతుపట్టడంలేదు.

> కస్తూరి తల్లి, ఇద్దరు ముసలమ్మల రోదన హృదయవిదారకంగా ఉంది. నాన్న మతి చలించినవాడిలా కూర్చున్నారు. వీథరుగు మీద పడుకోబెట్టారు శవాన్ని. దూరంగా గోడకు ఆనుకుని కూర్చుంది కస్తూరి. ఎవరెవరో వస్తున్నారు. అందరి చూపు కస్తూరి మీదే.

ఏమిటని కస్తూరి అడగలేదు. చెప్పే అవకాశం గంగాధరానికీ రాలేదు. కాని, అదెందుకో తెలిసేటప్పటికి అంతా అయిపోయింది.

తేజ మొదటి పుట్టినరోజు వెళ్ళిన నెలాపదిహేను రోజులకే జరిగింది. దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళని ముసలాళ్ళు ముగ్గురూ బయలుదేరారు. పిల్లవాడికి నీళ్ళ మార్పు మంచిదికాదని కస్తూరి ఆగిపోయింది. ముహూర్తం వేళకి వస్తానన్నాడు గంగాధరం. మరునాడు సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి చెప్పి వెళ్ళాడు, కస్తూరికి. అదే చెప్పడం, అదే వెళ్ళడం....

మరునాడు మధ్యాహ్నానికి అమ్మ, పెద్ద తమ్ముడు దిగారు. కూతురు ఎదురుపడగానే ముఖంపక్కకు తిప్పేసుకుని ఏడుస్తూ అమ్మ కుప్పకూలిపోవడం తను ఏనాటికీ మరిచిపోలేదు. తమ్ముడు అమ్మని వారించాడు. కస్తూరిని గుండె దిటువ చేసుకోమ్మన్నాడు. కస్తూరికి లీలగా అర్థమైనా, కొంతసేపటికే దృశ్యం స్పష్టమైంది.

మిట్టమధ్యాహ్నం వేళ వచ్చారంతా. వెనకే గుడ్డకట్టిన రిక్షా. అందులో గంగాధరం శవం.

పెళ్ళింట్లోనే కన్నుమూశాడు గంగాధరం. గుండెపోటు. ఇక్కడ బయలుదేరిన గంగాధరం ఆ ఊరు దగ్గరగా మెయిన్ రోడ్డు మీద బస్సు దిగాడు. ఎవరో సైకిల్ ఇస్తే దాని మీద బయలు దేరాడట. మధ్యలోనే ఆయాసం మొదలైంది. సైకిల్‌ను నడిపిస్తూ పందిట్లోకి చేరాడు. ఒక బంధువు చూసి గదిలో పడుకోబెట్టాడు. డాక్టర్ కోసం వెళ్లాడు. హడావిడి అంతా అయ్యాక ఎవరో వెళ్ళి చూశారు. అప్పటికే ప్రాణం పోయింది.

కస్తూరి తల్లి, ఇద్దరు ముసలమ్మల రోదన హృదయవిదారకంగా ఉంది. నాన్న మతి చలించినవాడిలా కూర్చున్నారు. వీథరుగు మీద పడుకోబెట్టారు శవాన్ని. దూరంగా గోడకు ఆనుకుని కూర్చుంది కస్తూరి. ఎవరెవరో వస్తున్నారు. అందరి చూపు కస్తూరి మీదే. తడవని ఆమె కనుకొనలమీదే. ఇక తట్టుకోలేక కస్తూరి తాత పంచెగగట్టి విసవిసా వచ్చాడు. వంగుని మొహంలో మొహం పెట్టి ఉన్న నాలుగు దంతాలని కొరుకుతూనే అన్నాడు-

"ఇంత ఇనపగుగ్గిళ్ళ బతుకేమే నీది? చెట్టంత మనిషి! మొగుడు; పోయాడే, ఏడుపైనా రాదేమేనీకు? ఉమ్ముతారనైనా లేదేమే ముదనష్టపు దానా!"

అప్పుడు కస్తూరి కళ్ళలో ఎగసిన మంటకి వెనక్కు తగ్గాడు. అందుకే ఒక్క మాటతోనే సరిపెట్టింది, ఆ ముఖం మీద ఉమ్మకుండా.

"నువ్వు.....నువ్వే ఏడవరా!"

ఉక్రోషం, బాధలతో తాను ఎంత గట్టిగా అరిచిందో కస్తూరికి అప్పుడు తెలియలేదు. కాని, పిన్ను కొట్టినట్టు ఇక నోరెత్తలేదు ముసలాడు. మనవరాళ్ళు కాస్తగా గట్టిగా నవ్వినా నిప్పులు మిసే నోరు, ఇంటిల్లపాదిని గడగడలాడించిన నోరు- మూతపడిపోయింది. మళ్ళీ ఒక్కసారే తెరుచుకుంది, కాస్త తులసితీర్థం కోసం. అప్పుడే ఆ మూడు ముక్కలూ వచ్చాయి - 'కస్తూరి విషయంలో నాదే తప్పు....'

ఆ మాటలు కుటుంబంలో అంతా విన్నారు, కస్తూరి తప్ప. తను అప్పటికే ఆంధ్రా యూనివర్శిటీలో ఉంది. గంగాధరం పోయాక పుట్టింటికి వచ్చేసింది కస్తూరి. తేజకి రెండేళ్ళు నిండాయి.

ఆ రోజు తండ్రికి కాఫీ గ్లాసు అందిస్తూ అంది కస్తూరి-

"నేను మళ్ళీ చదువుకుంటాను నాన్నా!"

చాల ప్రశ్నలకి ఏకకాలంలో జవాబులు దొరికినట్టయింది. బిఎస్‌సిలో ఫస్ట్‌క్లాస్ వచ్చిన సంగతి అత్తవారింటిలో ఉన్న కస్తూరికి తానే ఉత్తరం రాశాడు. డెబ్బయ్ శాతం మార్కులొచ్చినా

అప్పుడు ఆ విషయం ప్రాధాన్యానికి నోచు కోలేదు.

"ఏంచేద్దామనుకుంటున్నావ్ తల్లీ!" మామూ లుగానే అడిగారాయన.

రెండు నిమిషాల తరువాత ఒక కవర్ తెచ్చి తండ్రి చేతికి ఇచ్చింది. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి వచ్చిన మెమో, ఎంఎస్‌సి బోటనీలో సీటు కేటాయించినట్టు. ఆర్డర్ చదివి మనసారా నవ్వారాయన.

'మంచిది! ఇక నీ జీవితాన్ని నువ్వే దిద్దుకో దలిచావన్నమాట!' అన్నట్టుందా నవ్వు.

ఇంట్లోను,తన జీవితంలోను వచ్చిన మార్పు కస్తూరికి గొప్ప ఊరటనే ఇచ్చింది.తన ఒంటిమీ ద రంగు చీరలు ప్రశ్నార్థకంగా కాగా, నుదిటి మీద ఎర్రబొట్టు ఇరుగు పొరుగుకి కన్నెర్ర యిపోయింది. కుటుంబం మీద ఒక వెలి వాతా వరణం. ఇంట్లో సంఘర్షణ. తనకా చెప్పలేరు. ఈ ఉక్కపోత నుంచి అంతా తెరిపిన పడ్డారు. కాని ఒక్కటే దిగులు. తేజూ గురించి. వాడంటే ఇంటిల్లపాదికీ ప్రాణం. ఇద్దరు అన్నయ్యలు, చెల్లి, అమ్మ అందరికీ ముద్దే. కాబట్టి సమస్య ఆలనా పాలనా కాదు. దిగులంతా వాడిలో పొటమరిస్తున్న మార్పులు గురించే.వయసుకు మించి కనిపిస్తాడు. అన్ని గదుల్లోకి వాడి గురకే వినిపిస్తుంది.ఎంత ఒళ్ళో! ఇలాగే ఉంటాడా? పెరిగే కొద్దీ ఈ ఊబ పోతుందా? ఒకటే దిగులు...

'అబ్బ? ఎంతలావో!?' అని కొన్ని క్షణాలలో కొన్ని వేలసార్లయినా అనుకోవడం తనకింకా గుర్తే.

అదే మొదటిసారి తేజని చూడడం.ఉత్తరాలు పోస్టు చేస్తుంటే చటుక్కున గుర్తొచ్చింది అమ్మ లుకి ఆరోజు.

తను నాలుగో తరగతి కాబోలు అప్పుడు. స్కూలయ్యాక ఇంటికి వచ్చింది.

వరండాలో నేల మీద కూర్చుని అమ్మ పూరీ లు ఒత్తుతూ ఉంటే, ఎదురుగా మఠం వేసుక్కూర్చుని ఉడికిన బంగాళాదుంపలు వలు స్తున్నాడు. ఆ రోజు అమ్మ ఎంత సంతోషంగా ఉందో. తనే ముందు అన్నాడు, చూసి.

"అమ్మలు!?" కదా అన్నట్టు.

వెంటనే అన్నారు కస్తూరి మేడం.

"ఎగ్జాట్లీ....ఇక, నా అనుకుంటే, నీ చెల్లెల్రా తేజూ"

అనుకోకుండా కొన్ని లిప్తలు ఇబ్బందికరమైన మౌనం.

పదినిమిషాల తరువాత చేతులు కడు క్కుని తన సూట్‌కేసులో నుంచి రెండు గిఫ్ట్‌ప్యాక్‌లు తెచ్చి అమ్మలు చేతిలో పెట్టాడు తేజ. ఒక దాంట్లో చక్కని ఫ్రాక్ ఉంది. రెండోది టాఫీలు. రెండింటి మీద లేబుల్ అతికించి అందంగా రాశాడు- 'అమ్మలుకి, ప్రేమతో అన్నయ్య'.అమ్మ కంటిలో నీటి తెర, ఆనందంతో.

అమ్మ మాటకి ఎంత బాగా సమాధానం చెప్పాడో అని పించింది.

ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువు తున్నాడంటే తనకి నమ్మబుద్ధి కాలేదు. వచ్చినప్పటి నుంచి ఎగాదిగా చూస్తూనే ఉంది. తేజ గమనించకపోలేదు. తన మీద తనే జోక్ వేసుకున్నాడు.

"ఈ బ్రదర్, అదే హాఫ్ బ్రదర్, ఇంత ఫుల్ సైజులో ఉన్నాడేమిటా అనుకుంటోంది" అన్నాడు హాయిగా నవ్వేస్తూ.

ఆ నవ్వుకి ఊగిన పొట్టమీద చిన్నగా చరిచి 'కాస్త తగ్గించాల్రా!' అన్నారు కస్తూరి మేడం.

**ఏమండీ! వీడే మా అబ్బాయి అనాలా మొగుడితో! కాకపోతే వీడే నా కొడుకు అనాలా! ఆదీకాకపోతే 'ఇతను తేజ' అని కొడుకుని ఒక ఆగంత కుడిలా పరిచయం చేయాలా! అని తర్కించుకుందామె.**

ముగ్గురూ ఒకే గదిలో పడుకున్నారు. కబుర్ల మీద సగం రాత్రి కరిగాక అక్కడే పొంచి ఉన్న ట్టు ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది గదిలో.

అమ్మలు కలవరిస్తే చటుక్కున మేలుకొన్నారు కస్తూరి మేడం. ముందు ఏదో సణుగుడు. తరువాత ఎవరో గిల్లినట్టు కెవ్వున కేక. ఆపై నవ్వేసింది- నిద్దట్లోనే.

"పడుకోమ్మా! అమ్మలూ!" చీకటి గదిలో కస్తూరి మేడం గొంతు జీరతో వినిపించింది, మత్తుగా.

"మంచినీళ్ళు కావాలేమోనమ్మా?" అన్నాడు తేజ.

" నువ్వింకా నిద్ర పోలేదురా?" అడిగారామె.

"నిద్ర తేలిపోయింది"


సమయం ఒంటిగంటవుతుందేమో! కొన్ని నిమిషాల తరువాత అడిగారామె, మగత వీడని ఆ జీర గొంతుతోనే.

" ఏరా తేజూ! నీకూ కలవరించే అలవా టుందా?"

" ఓ బ్రమ్మాండంగా. గురక, కలవరింతు లూ...."

ఆమె ఎప్పుడు అడుగు తుందా, ఎప్పుడు ఈమాట చెబుదామా అని నిరీక్షిస్తున్నట్టు వెంటనే అన్నాడు.

తాను ఏ గదిలో పడుకునేది,కునికిపాట్లు పడుతూ తాతయ్య తన హోంవర్కు ఎలా చేయించేది, తరువాత నిద్ర పుచ్చేది చెప్పాడు.



"........సరిగ్గా తాతయ్య జోకొడుతున్నపుడే అడుగుతూ ఉండేవాడిని ఎప్పుడైనా- అమ్మ దగ్గరికి వెళ్దామని. కాని, అలాంటి మాటలు ఆ క్షణంలోనే కాదు, కొన్ని నెలల దాకా ఎత్తకుండా మరిపించేవాడు. అది కూడా ఒంటిమీద దెబ్బ వెయ్యకుండా అంటే నమ్మమ్మా! నాకు కొంచెం జ్ఞానం వచ్చాక ఓసారి మాత్రం గట్టిగా మారాం చేశాను. నువ్వు కొడిగనహళ్ళిలో ఉన్నావని మన చుట్టాలెవరో చెప్పారప్పుడే. నీదగ్గరకి వెళ్ళా ల్సిందేనని పట్టుపట్టాను. కాని, అప్పుడు కూడా తాతయ్యే గెలిచారు. తాను బతికుండగా నా నోటి నుంచి నీ ప్రస్తావన రాకుండా చేశాడా యన. నా చేతిని ఆయన చేతిలోకి తీసుకుని 'కనీసం నేను బతికుండగా ఆ మనిషి మాట ఎత్తనని, ఇదిగో, ఒట్టేస్తున్నావ్!' అన్నాడు...."

మాటలు ఆగిపోయాయి,చీకట్లో తడిసిన ఓ బరువైన మౌనం మళ్ళీ గది నిండా.

కొద్దిసేపటికి కస్తూరి నోటి నుంచి ఒక దీర్ఘ నిట్టూర్పు... కట్టలు తెగిన దు:ఖం ఆగిన తరు వాత వచ్చే నిట్టూర్పు. కాని, అది తేజకి విని పించలేదు.

అప్పటికే గురక పెడుతున్నాడు.

రెండోరోజు మధ్యాహ్నం చెప్పాడు తేజ- తాను సాయంత్రం వెళుతున్నట్టు.

"అదేమిట్రా? రాత్రికి అమ్మలూ వాళ్ళ నాన్న గారొస్తుంటే!" అన్నారు కస్తూరి.

"అందుకేనమ్మా వెళుతున్నది!" కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు.

తుపాను చూద్దామని కిటికీ తెరిస్తే ఏమవు తుంది? అదే అయింది.గులకరాళ్ళు ముఖం మీద విసిరినట్టుండే జల్లులా ఉందామాట.

"ఈసారి వచ్చినపుడు కలుసుకుంటానమ్మా!" సర్దుకుని అన్నాడు తనే.

అప్పటిదాకా కస్తూరి మేడంకి ఆ ఆలోచనే రాలేదసలు. నిజమే. మళ్ళీ మరో తడబాటు కాబోలు. ఆయనకి వీడిని పరిచయం చేయడం దగ్గరే తత్తరపాటు మొదలవుతుంది. ఏమండీ! వీడే మా అబ్బాయి అనాలా మొగుడితో! కాకపోతే వీడే నా కొడుకు అనాలా! ఆదీకాకపోతే 'ఇతను తేజ' అని కొడుకుని ఒక ఆగంతకుడిలా పరిచయం చేయా లా! అని తర్కించుకుందామె.

అయినా రావుగారిని పెళ్ళి చేసు కున్న తరువాత ఇలాంటి తత్తర పాట్లని చాలనే ఎదుర్కొన్నదామె.

కుటుంబం, తేజులకి కూడా దూరంగా చదువు, పుస్తకాలలో మునిగిపోయి ఏకాంతాన్ని అను భవిస్తున్న తరుణంలో పరిచమ య్యారు రావుగారు. రాజారామ్ గారిని రావుగారనే పిలుస్తారావెం. ఎంతకాదనుకున్నా ఎప్పుడో చటు క్కున దాడిచేసే కొన్ని బెంగల నుంచి చక్కగా రక్షించేవి పుస్తకాలు. గురజాడ, విశ్వనాథ, బాపిరాజు, కొకు, చలం, బుచ్చి బాబు, శరత్‌బాబు...."బోటనీ స్టూడెంటువి, నీకీ టేస్టేమిటీ" అనేవారు హాస్టల్లో రూమ్మేట్స్. కాస్త పరిచయమయ్యాక రాజా రామ్‌గారూ ఇదే మాటన్నారు. విఎస్ కృష్ణా లైబ్రెరీలో తెలుగు సెక్షన్‌లో పనిచేసేవారు రాజారామ్‌గారు, అసి స్టెంట్ లైబ్రేరియన్.

"లిటరేచర్ వాళ్ళు తప్ప ఇతరులు పుస్తకాల జోలికి వెళ్ళకూడదంటారా ఏమిటి?" అంది కస్తూరి.

" నో మేడం! ఇంతపెద్ద చదువులకి వచ్చిన వాళ్ళు, కేవలం లిటరేట్స్‌గా మిగిలిపోకూడదు. లిటరేటర్స్ కూడా కావాలి." అన్నారాయన.

"అదంటారా! సరే, 'చివరకు మిగిలేది' ఉందా?"

వెంటనే వెళ్ళి ఒక ర్యాక్ నుంచి తనే తెచ్చారు. దాని అట్టలు తనిఖీ చేశారు. చెవులు మడిచిన పేజీలని సరిచేశారు. ఈ నవలకి బుచ్చిబాబు మొదట ఏకాంతం అని పేరుపెడితే ఆచంట జానకీరామ్ గారు చివరికి మిగిలేది అని మార్చారని చెప్పింది రాజారామ్‌గారే. లోపల ఉంటే ఎప్పుడూ పుస్తకాలు సర్దుతూ ఉండేవారు. లేకపోతే బయట భోగన్‌విల్లా గుబుర్ల కింద సిమెంట్ బెంచీల మీద కూర్చుని గడ్డం నవరించుకుంటూ సిగరెట్లు కాలుస్తూ ఉండేవారు. ఏదైనా గంటల తరబడే. దేని నుంచో పారిపోవడానికి ప్రయత్నిస్తున్న మనిషిలా ఉండేవారు. సెలవనేదే ఉండేది కాదు. నిత్యం కనిపించేవారు. అలాంటి మనిషి ఒక్కసారిగా ఐదురోజులు కనిపించలేదపుడు. ఆశ్చర్యం, ఆసక్తి కలిగాయి. మొదటిసారిగా మామూలుగా వాకబు చేసింది కస్తూరి అక్కడే ఉన్న జూనియర్ లైబ్రేరియన్‌ని. ఆమె చెప్పింది. రాజారామ్‌గారు దివిసీమ వెళ్ళారట. 15 రోజుల క్రితం వచ్చిన తుపానులో కొన్ని గ్రామాలే జలసమాధయినాయి. అక్కడకి ఒక స్వచ్ఛంద సేవకునిగా వెళ్ళారట. ఇది మరీ ఆసక్తి కలిగించింది. వారం తరువాత మళ్ళీ వెళ్ళినపుడు అడిగితే ఆమే చెప్పింది.

" మీకు తెలియదు కదూ! రాజారామ్ గారిని ఆస్పత్రిలో చేర్చారండీ! తుపాను ప్రాంతంలో వారం ఉన్నారు కదా! నీళ్ళూ నిప్పులూ లేవు. పైగా శవాల్ని కూడా తీశారట. దాంతో...."

"ఏ ఆస్పత్రి?"

"యూనివర్శిటీ డిస్పెన్సరీలోనే"

"ఇపుడెలా ఉంది?"

"ఇప్పుడు ఫర్వాలేదు. వాళ్ళమ్మగారు పెద్దావిడ. బెంగటిల్లిపోయింది. ఆవిడ మంచం పట్టేలా ఉంది."

"వారి శ్రీమతి ఇక్కడ లేరా?"

" ఆవిడ చాలాకాలం క్రితమే పోయారండి. లేరు"

ఈ మనిషి వెనుక ఇంత కథ ఉందా అనుకుంది కస్తూరి. రాజారామ్‌గారి మీద ఉన్న గౌరవంతో చాలమంది స్టూడెంట్సు కూడా వెళ్ళి పలకరించి వచ్చారు. కస్తూరీ వెళ్ళింది. పది రోజుల తరువాత మళ్ళీ లైబ్రరీకి వెళితే సిమెంట్ బెంచి మీద కూర్చుని సిగరెట్ తాగుతున్నారాయన. కస్తూరి దగ్గరగా రావడం చూసి సిగరెట్ పడేశారు. ముసలమ్మగారి ఆరోగ్యం కూడా కుదుట పడిందట.

బిడ్డ అడ్డం తిరిగి పురిట్లోనే భార్య పోవడం, తన ఊరు, కుటుంబం, అన్నీ అప్పుడే చెప్పుకొచ్చారు. అలా కస్తూరి జీవితానికి సంబంధించిన విషయాలు తెలుసుకునే అవకాశం యాదృచ్ఛికంగా ఆయనకు వచ్చింది. మొదటిసారి కస్తూరి ఒక బయటి వ్యక్తికి తన గురించి చెప్పింది.

రెండు మాసాల తరువాత అక్కడే ఆయన ప్రతిపాదించారు- చిన్న ఇంట్రడక్షన్‌తో. "మీరు, నేను కొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చు, ఇద్దరం ఇష్టపడితే, ముఖ్యంగా మీరు..." అని విషయం ముగించారు.

బిత్తరపోయిన కస్తూరి చటుక్కున లేచి నిలబడింది. ఇన్నేళ్ళకి, ఇంత జరిగాక మళ్ళీ ఆ పెళ్ళి మాట ఏదోలా అనిపించింది. కాని, రాజారామ్ గారి వ్యక్తిత్వం, ప్రవర్తన మరో విధంగా శంకించడానికి తావీయలేదు. కస్తూరి నోటి నుంచి కూడా మామూలుగానే ఆ మాట వచ్చేసింది.

" నాకా ఆలోచన లేదు సార్! అయినా మూడు మాసాల్లో ఫైనల్ పరీక్షలు. ఇపుడు ఆలోచించడానికి నేను సిద్ధంగా లేను. సారీ!"

ఇక లైబ్రరీకి పోలేదు. అసలు ఎక్కడికీ పోలేదు. పరీక్ష హాలుకే వెళ్ళింది.

చివరి పరీక్షరాసి బయటకు వచ్చింది కస్తూరి. బోటనీ డిపార్టుమెంట్‌కి ఎదురుగా చెట్టుకింద నిలబడి ఉన్నారు రాజారామ్‌గారు.

కస్తూరే దగ్గరకెళ్ళి బాగున్నారా అని పలకరించింది.

"క్షేమంగ్గా ఉన్నాను. బాగా రాశారా పరీక్షలు! సరే, ఒక్కమాట. మీరు చాల చిన్నవారు. పెద్ద విషాదాన్ని మోస్తున్నారు. అందుకే కొత్త జీవితం గురించి ఆలోచించమన్నాను. అందులో నాకు ఎలాంటి స్థానం అనేది ప్రశ్నే కాదు. కావలసిందల్లా మీరు కొత్త జీవితం కోసం ఆకాంక్షించడం, అది అవసరమని విశ్వసించడం. మరి సెలవా!" అనేసి వెళ్ళి పోయారు.

అక్కడ మొదలైంది గుంజాటన.

ఎటు మొగ్గిందో కూడా తనకి తెలియదు.

తరువాత ఎంఫిల్‌లో చేరింది కస్తూరి. అప్పుడు మాత్రం స్పష్టంగా తెలిసింది- తను కొత్త జీవితం వైపే మొగ్గుతున్నానని. ఎంఫిల్ పూర్తయ్యాక కేవలం ఆరేడుగురు మిత్రులు సమక్షంలో రాజారామ్, కస్తూరి సింహాచలంలో పెళ్ళి చేసుకున్నారు. ఈ పెళ్ళి గురించి కస్తూరి ఇంటిలో అప్పటికి తెలియదు. రాజారామ్‌గారి తల్లికి తెలుసు. ఆవిడ బహిష్కరించింది.

*బిత్తరపోయిన కస్తూరి చటుక్కున లేచి నిలబడింది. ఇన్నేళ్ళకి, ఇంత జరిగాక మళ్ళీ ఆ పెళ్ళి మాట ఏదోలా అనిపించింది. కాని, రాజారామ్ గారి వ్యక్తిత్వం, ప్రవర్తన మరో విధంగా శంకించడానికి తావీయలేదు.*

రెండు మాసాల తరువాత మళ్ళీ వచ్చినపుడు తేజాయే కస్తూరి మేడం సమస్యని సున్నితంగా పరిష్కరించాడు.

వీథరుగు మీద పడక్కుర్చిలో పేపరు చదువుతున్నారు రాజారామ్‌గారు. అడుగుల చప్పుడైతే తలెత్తి చూశారు.

"నమస్కారం. ఆయామ్ తేజ"

"నమస్కారం, నమస్కారం. రావోయ్, రా! కూర్చో. మేడమ్ గారూ! తేజ వచ్చాడు. ఒకసారి ఇలావస్తారా? అమ్మలూ! బ్యాగ్ లోపలెట్టి కాసిన్ని మంచినీళ్ళ య్యమ్మ!" అన్నారు.

క్రితంసారి వచ్చినపుడు ఉన్నంత కలివిడిగా ఉండలేకపోయాడు తేజ. అతడి మౌనం మాటున అగ్ని వర్వ తాలు వగులుతున్న సంగతి కస్తూరికి తెలుసు.

నిజం కూడా. రాజారామ్‌గారిని పలకరించాడన్న మాటేగాని అది దారుణమైన అశాంతికి అసంతృప్తికి కారణమైంది. ఆ రోజున, ఆరోజే కాదు, తర్వాత ఎన్నోసార్లు- తాతయ్య అంత ఈసడింపుగా ఉదహరించిన వ్యక్తిని మొదటిసారి పలకరించాడు మరి.

ఆ సంగతి ఆ నోటా ఆనోటా వృద్ధ సింహానికి తెలిసింది. ఆ మరునాడే ఇద్దరు ముసలమ్మలు కస్తూరి ఇంటికి వచ్చారు. తియ్యగా మాట్లాడారు. తేజ తాతగారికి బాగుండలేదని, మనవడిని చూడాలంటున్నాడని, రెండు రోజుల్లో మళ్ళీ తీసుకొచ్చి అప్పగిస్తామని చెప్పి తీసుకువెళ్ళారు.

వారం గడిచింది. పది రోజులు గడిచాయి. తేజని తీసుకురాలేదు.

విశాఖలో ఉన్న కస్తూరికి సంగతి చెప్పారు. ఎవరినీ వద్దని తాను ఒక్కర్తే అత్తవారి ఊరు వెళ్ళింది.

తనను చూసి వృద్ధ సింహంలేచి కూర్చుంది. సావిట్లో తేజ మాటలు వినిపిస్తున్నాయి. సందేహిస్తూనే మెట్లెక్కబోయింది కస్తూరి.

"అక్కడే ఉండండి!" ముఖంలో కోపం కనిపించకపోయినా మాటల నిండా కరుకుదనం, కసి.

" నా కొడుకు వచ్చాక మీరు వాణ్ణెవణ్ణో మళ్ళీ కట్టుకున్నారు. ఇంక నా గడప తొక్కడం భావ్యం కాదు. మీరెందుకు వచ్చారో తెలుసు. అయినా మీరు మాట్లాడకుండా వచ్చిన దారినే వెళ్ళిపోవడం మంచిది. తేజ మీ దగ్గరికి రావడం కలలో మాట. కోర్టుకు వెళ్ళినా నేనే గెలుస్తాను. కాస్త ఆలస్యం కావచ్చు. అంతే. అర్థం చేసుకుని వెళ్ళిపొండి. అయినా తేజని మీరు వదులుకున్నా ఆ లోటు మీ పునర్వివాహం తీరుస్తుందనుకుంటాను. కాని, ఈ ఇంటికి అలాంటి అవకాశం లేదు. రాదు. దయచేసి వెళ్ళిపొండి. మీ పునర్వివాహం గురించి నేను తీర్పు చెప్పబోవడం లేదు. అయినా, భరణం కావాలంటే ఇచ్చేస్తాను. తేజను పంపడం మాత్రం కుదరదు. పంపను"

"నేను చెప్పేది కొంచెం...."

బాధతో, అవమానంతో, దగ్గుత్తికతో కస్తూరి ఏదో చెప్పబోయింది.


"ఏమీ చెప్పొద్దు. వెళ్ళిపొండి!"

ఈ మాటలకి వీథిలోకి వచ్చాడు తేజ. ఒక అపరిచితను చూసినట్టు ఒక్కసారి తేరపార చూశాడు, వెనుదిరిగాడు. పది రోజులకే వాడి మనసు విరిచేశారా అను కుంది కస్తూరి.

తను ఎలా ఎదిగాడో చాల సందర్భాలలో చెప్పాడు తేజ. చుట్టాల్లో, స్కూల్లో ఎలాంటి మాటలు విన్నాడో చెప్పాడు. ప్రతిమాట వాడి మనసు పడిన సంఘర్షణని తడిమి వచ్చినట్టు ఉండేవి. కస్తూరి మేడంకి కళ్ళ నీళ్ళు తెచ్చేవి. అయినా ఒక శాడిజంతో ఉన్నట్టు ఒక్కొక్కటీ వినిపించేవాడు. రాజారామ్‌గారికి ఎదురుపడవలసి వస్తే మాత్రం ఎంత సంస్కారంగా మాట్లాడేవాడో.

*(తరువాయి 19వ పేజీలో)*

# విడో పక్షులు



ఈ పక్షులని ఇలా పిలుస్తేనే బాగుంటుంది. తెలుగులోకి అనువాదం చేసి పిలిస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కాని వీటికి ఆ పేరు ఎలా వచ్చిందో కూడా ఆశ్చర్యమే. కొన్ని సాలెపురుగులు, గొల్లభామ భర్తని నిర్దాక్షిణ్యంగా హత్య చేయడమేకాక ఆరగిస్తాయి. వాటికి ఆ పేరు బాగా అమరుతుంది. వాస్తవానికి ఒక విడో స్పైడర్ ఉంది అలాటిదే. పైగా ఈ పక్షులని శాస్త్రీయంగా విడువా అంటారు. మన తెలుగు పదం విధవకి దగ్గరగానే ఉండడం ఆసక్తికర విషయం. వీటికి ఒక విశేషమైన అలవాటు ఉంది. తమ పిల్లల్ని తాము ఇవి పోషించుకోలేవు. కోయిల పద్ధతే. ఈ విధానాన్ని బ్రూడ్ పారసైటిజమ్ అంటారు. విడో పక్షులు అనేకరకాల వాక్స్ బిల్ పక్షులని ఆశ్రయిస్తాయి. కోయిల, కాకిగూళ్లలో గుడ్లు పెడుతుంది. అలాగే కక్కూపక్షులు (కోయిలలాటివి) వివిధ పక్షి జాతుల గూళ్లలో గుడ్లు పెడతాయి. ప్రత్యేకంగా ఒకేరకం జాతిపక్షి గూట్లోనే గుడ్లు పెట్టాలనే నియమం వాటికి లేదు.

కాని ఈ విడో పక్షులు అలాకాదు. ప్రత్యేకంగా ఒక్కొక్క జాతి ఒక్కొక్క జాతి పక్షిని ఆశ్రయిస్తుంది. ఇంకా ఇందులో చాలా విశేషాలున్నాయి. వాక్స్ బిల్ పక్షులు డోమ్ ఆకారంలో గూళ్లు నిర్మించుకొంటా యి. అంతే ఈ విడోపక్షి కూడా అదే గూట్లోకి ప్రవేశించి తన గుడ్లను పెట్టేస్తుంది, నా పిల్లల్ని కూడా పెంచి పోషించండి అన్నట్లు. మరి ఎందువల్లనో ఆ వాక్స్ బిల్ పక్షిని ఏ మాయమత్తు ఆవరిస్తుందో అది ఏమీ అభ్యంతరం పెట్టదు. విడో పక్షుల గుడ్లు కూడా వాక్స్ బిల్ పక్షుల గుడ్లలాగే తెల్లగా ఉంటాయి. కాని విడోపక్షి గుడ్లు కాస్త పెద్దవి. కక్కూ పక్షులు తమకు ఆశ్రయమిచ్చిన సంతతి పిల్లల్ని నాశనం చేసి మరీ ఎదుగుతాయి. వాటి పగ అలాటిది మరి ఎందువల్లనో. ఈ విడో పక్షి పిల్లలు అంత ఘోరానికి పూనుకోవు. ఏకోదరులమే అనే భావంతోనే కలిసిమెలిసి తల్లిదండ్రులు తెచ్చిన ఆహారం తింటాయి. ఆ పెద్ద పక్షులు కూడా ఏమాత్రం సవతితల్లి ప్రేమ చూపించక ఆహారం అన్నిటికీ సమానంగా అందిస్తాయి.

ఇంకా చూడండి. వాక్స్ బిల్ పక్షుల పిల్లల దవడల అంచుల్లో కొన్ని గుర్తులు ప్రత్యేకంగా ఉంటాయి. మరింకేం- ఈ విడో పక్షుల పిల్లలు సయితం అదేరకం దవడల ముస్తాబుతో తయారవుతాయి. తల్లిదండ్రులు ఈ తేడాని గుర్తించలేక మరి అన్నిటికి తిండి అందిస్తాయి. వాస్తవానికి ఆ గుర్తుల వల్లనే తల్లి పక్షి తను తెచ్చిన ఆహారం ఎక్కడ నోట్లో పెట్టుకోవాలో తెలుసుకొంటుంది. పరిణామ విశేషం ఏమంటే పోషించే పక్షులు ఎలాటి పరిణామానికి గురి అవుతాయో ఈ పోషించబడే పక్షులు ఏమాత్రం వెనకబడకుండా అదే ముస్తాబు సంతరించుకొంటాయి. పెద్దదవుతున్నకొద్ది శరీరం మీద ఈకల్ని కూడా ఆ పోషించే పక్షుల మాదిరిగానే రూపొందించుకొంటాయి. అంతేకాదు ఆ పక్షి పిల్లల స్వరం ఎలాఉంటుందో ఈ విడో పక్షి పిల్లలు అలాగే అరుస్తాయి. మరి సవతి పిల్లలకు ఏ ఇబ్బంది ఉండదు. పైగా ఈ విడో పక్షులు ఆ వాక్స్ బిల్ పక్షులలాగే కూతలు మొదలుపెట్టి, వాటి గూళ్ల దగ్గిరే ప్రణయ కలాపాలు సాగించి వాటి గూళ్లలోనే గుడ్లు పెట్టి వెళ్లిపోతాయి! ఎంత ఇంసల్ట్ వాక్స్ బిల్స్ కి!

- జమ్మి కోనేటిరావు

# నిన్నటి కన్నీళ్ళ వెచ్చదనం

(తొమ్మిదవ పేజీ తరువాయి)

మనుషుల పట్ల తేజలో కనిపించే ఒక సానుకూల దృక్పథం ఒక తల్లి గర్వించేటట్టు ఉండేది.

అప్పుడ చాల రోజులకి వచ్చాడు, ఇంజనీరింగ్ ఫైనలీయర్‌లో. సరాసరి హాల్లోకి వచ్చి షూస్ విప్పుతున్నాడు వంగి. ముడి బిగిసిందో ఏమో, కొన్ని నిమిషాలు పట్టింది. అప్పటికే అమ్మలు చెప్పడం, కస్తూరి వచ్చి సోఫాలో పక్కన కూర్చుని యోగక్షేమాలు అడగడం కూడా అయింది. అప్పుడు లేచి తల్లి కేసి తిరగాడు.

దెయ్యాన్ని చూసినట్టు అదిరిపడ్డారు కస్తూరి మేడం. ముమ్మూర్తులా గంగాధరమే. తేజ తేజూలాగే లేడు. చటుక్కున లేచిపోయారామె. కళ్ళలో నీరు చిమ్మింది. "ఏరా తేజూ! నేను చెప్పాను కాబట్టి ఇంకా ఒళ్ళు పెంచుతున్నావా. తగ్గించరా బాబూ! నీ వయసుకి ఇంత శరీరమా? ఉండకూడదురా నాయనా!" అనేశారామె.

కాని, ఆమె మాటని చాల ఈజీగా తీసుకున్నాడు తేజ.

"ఫైనలీయర్ కదమ్మా! డిన్నర్లు, పార్టీలు కాస్త ఎక్కువయ్యాయి అంతే."

ఎందుకు ఆగిందో ఇప్పటికీ కస్తూరీ మేడంకు తెలియదు, పెదవి దాకా వచ్చినా-'నువ్వు ఒళ్ళు తగ్గించేదాకా నాక్కనిపించొద్దురా! అంతే' అన్నమాట.

కాని, ఒకటి అర్థమైంది, తనికీ వాడికీ మధ్య ఎంత మానసిక దూరం ఉందో. వస్తున్నాడు, వెళుతున్నాడు. అమ్మా అంటూ ఆప్యాయంగా ఎదురుగా కూర్చుంటాడు. కస్తూరి కళ్ళకి ముందు రెండు నిమిషాలు మాత్రమే వాడు తేజ. మరు నిమిషానికి గంగాధరం. 'ఒరేయ్ నిన్ను కట్టుకునేది ఏడుస్తుందిరా' అనీ, ఆఖరికి 'ఆ లావుతోనేరా మీ నాన్న అలా పోయాడు'ని కూడా చెప్పాలనుకునేవారామె. తేజు వస్తే బాధ, రాకపోతే బాధ. ఎప్పుడు వచ్చినా ఎప్పుడు మాట్లాడినా ఏదో ఒక క్షణంలో గంగాధరం ముందు కూర్చుని, గంగాధరంతో మాట్లాడుతున్నట్టే అనిపించేది, కాలాన్ని రీప్లే చేసినట్టు. తటాల్న లేచి వెళ్ళిపోయేది. అంతవరకు వచ్చింది. ఆ నవ్వు, ఆ నడక, ఆఖరికి ఆ మాట అంతా ఆ మనిషే. ఇది గంగాధరానికి పునర్జన్మ కాదు కదా!

** ** **

"అమ్మలూ! ఈ కార్డు కాస్త పోస్టు చెయ్యవే!" చెప్పేసి మెట్లు దిగారు కస్తూరి మేడం.

ఆ ఉత్తరం తేజాకే. ఆత్రంగా చదివింది అమ్మలు. ఆ ముక్కలే-

తేజూ నాన్నా!

ఆశీస్సులు. ఉభయకుశలోపరి. నీ ఉత్తరం అందింది. చాల సంతోషం. నీవు జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. అధిరోహించగలవని నమ్ముతున్నాను కూడా. నాన్నా! నువ్వెక్కడ ఉన్నా నీ క్షేమం కోరుతూనే ఉంటాను. నీ అభివృద్ధికి మొదట సంతోషించేదాన్ని నేనే. వెళ్ళిరా. నా కోసం ఎదురు చూడొద్దు. ఉంటా.

మీ అమ్మ

అమ్మ అంతరంగం అమ్మలుకి అంతుబట్టలేదు.



మీరు అనుకోకుండా ఏదైనా ఇబ్బందులలో చిక్కుకున్నా బాధ పడవలసిన అవసరం లేదు. వెంటనే మా ఆశ్రమ ఉంగరం పొంది ధరించుట లేదా మీ వద్ద ఉంచుకొనుట ద్వారా ఇది మీరు కోరుకున్న పురుషుడు లేదా స్త్రీ మనసుని మీ వైపు ఆకర్షిస్తుంది. మీరు ఎవరి పేరు ఉచ్చరిస్తారో, వారు ఎంతటి కఠిన హృదయం కలిగినవారైనా మీ పాదాల చెంత దాసోహం అంటారు. ఇంకా వారు మీ ఇష్టప్రకారం వ్యవహరిస్తూ నడుచుకుంటారు. వ్యాపారంలో లాభం, పరీక్షలలో విజయం, మనసుకు నచ్చిన వివాహం, పుత్రభాగ్యం, లాటరీలో బహుమతులు, ఇంట్లో గొడవలు, అనారోగ్యాలు, అప్పుల సమస్యలు మొదలైన ఇబ్బందుల నుండి విముక్తి, ఆరోగ్యం విషయంలో అనుకూలత, జ్ఞాపక శక్తి అభివృద్ధి, ఉద్యోగంలో ఉన్నత పదవులు, వ్యాజ్యాలలో విజయం, పోగొట్టుకున్న వస్తువులు దొరకుట, ఇంట్లో సుఖసంతోషాలు, ఇలా మీరు దినదిన ప్రవర్ధమానంగా పురోభివృద్ధి చెందుతూ, అన్ని పనులలో విజయ సాధించేలా చేసే ఈ అద్భుత సిద్ధ ఉంగరం ఇప్పుడు మా ఆశ్రమ విశేష యజ్ఞం సందర్భంగా కొద్ది రోజులు వరకు ఉచితంగా పంపించబడుతున్నది. దీనిని కావాలనుకొనేవారు తమ పేరు, చిరునామా మరియు ఒకటి నుండి తొమ్మిది లోపల ఒక అంకెను మరవకుండా మాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం. మీరు సంప్రదించవలసిన చిరునామా:

PUJA ALAYAM (437 'C' - Block)
P.O. BHULI (DHANBAD) PIN:828 105

The publication will not be held responsibble for any kind of dispute.